క్లుప్తంగా

మోడల్ స్కూల్‌లో అధ్యాపకులకు ఆహ్వానం

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలంలోని మోర్గి మోడల్ స్కూల్‌లో గంటల ప్రాతిపదికన బోధించేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామారావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీటీలో తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్, జువాలజీ, ఎకనామిక్స్, సివిక్స్, టీజీటీ సైన్స్ సబ్జెక్టులు బోధించేందుకు అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. దరఖాస్తులు ఈనెల 26 సాయంత్రం 4గంటలోపు సమర్పించాలని, 27న ఉ.10గంటలకు డెమో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులపై సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్సూర్

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్, సిర్గాపూర్ అధికారులతో బుధవారం ఎంపీడీఓలు రమేష్ బాబు, మల్సూర్ సమీక్ష సమావేశం నిర్వహించా రు. ఓటరు జాబితా సవరణ, స్వచ్ఛతా హీ సేవ, ఉపాధిహామీ పథకం పనులపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీఓ బ్రహ్మం, ఏపీఓ బస్వరాజ్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నమోదులో తప్పులు

మునిపల్లి(అందోల్): ప్రజాపాలనలో లబ్ధిదారుల నుంచి తీసుకున్న పత్రాలను ఆన్‌లైన్ చేసే వారు ఆధార్ నంబర్లను తప్పుగా నమోదు చేయడంతో సంక్షేమ పథకాలకు అనర్హులుగా మిగిలిపోతున్నారు. బుధవారం మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన గొల్ల తుల్జమ్మ ప్రజాపాలన దరఖాస్తును పరిశీలించారు. ప్రజాపాలన దరఖాస్తు ఫారంలో ఆధార్ నంబర్‌ను తప్పుగా నమోదు చేశారు. దీంతో ప్రభుత్వం మంజూరు చేసే సంక్షేమ పథకాలు అందడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి మరోసారి ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.


డీఎస్పీ, సీఐలకు సన్మానం



సన్మానిస్తున్న ముస్లిం పెద్దలు

పటాన్‌చెరు టౌన్: పటాన్ చెరు డివిజన్‌లో 'మిలాద్-ఉన్-నబీ' పర్వదినం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమాల విజయవంతానికి సంపూర్ణ సహకారం అందించిన పటాన్ చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ ప్రవీణ్‌రెడ్డి, ఎస్‌ఐలను మిలాద్ కమిటీ సభ్యులు బుధవారం సన్మానించారు. పండుగల సమయంలో పోలీసుల సహకారం మరువలేనిదన్నారు. ఈ సందర్భంగా పటాన్ చెరు డివిజన్ ముస్లింలు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మునిపల్లి(అందోల్): డబుల్ బెడ్ రూం ఇళ్లకు సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతికి బుధవారం సీపీఎం నాయకులు రమేశ్‌గౌడ్ వినతిపత్రం అందజేశారు. వర్షం పడితే రోడ్డు బురదమయంగా మారి ప్రజలు నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అన్ని రంగాల్లో రాణించాలి



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సింధు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్ రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని ఎల్‌ఐజీ విద్యాభారతి పాఠశాలలో సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న వైజ్ఞానిక ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సింధు మాట్లాడుతూ.. విద్యార్థులు సైన్స్ పట్ల మరింత ఆసక్తిని పెంచుకోవాలన్నారు. నేడు ప్రపంచం సైన్స్‌పై ఆధారపడి నడుస్తోందన్నారు. ఇలాంటి ప్రదర్శనల వల్ల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించిన వారమవుతామని తెలిపారు.

ఉపాధి అధికారుల పనితీరుపై ఆగ్రహం



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

ఝరాసంగం(జహీరాబాద్): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారుల పనితీరుపై జిల్లా ఉన్నత అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఝరాసంగం మండల ప్రజా పరిషత్తు కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనుల వివరాలను అధికారులు చదివి వినిపించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో కూలీల ఖర్చు రూ.8 కోట్ల 23 లక్షల 4వేలు, మెటీరియల్ ఖర్చు రూ.19,41,485 చేసినట్లు వివరించారు. పని దినాలు ఎక్కువగా ఉండి, తక్కువ పని చేసి పేమెంట్ చేయడంతో కూలీలకు నష్టం జరిగిందని గుర్తించారు. పలుచోట్ల పని చేయకుండా ఎక్కువ కూలీ డబ్బులు చెల్లించినట్లు, ఎంబీ రికార్డు లేకుండానే పేమెంట్ చేసినట్లు గుర్తించారు. పనులు ముగిసిన తర్వాత మస్టర్లలో దిద్దుబాటు చేయడం, కొలతలు సరైన విధంగా రికార్డు చేయకపోవడం, కూలీలు హాజరు కాకుండా డబ్బులు చెల్లించడం, మస్టర్లలో హాజరు వివరాలు తప్పుగా ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. దీంతో ఉన్నతాధికారులు ఉపాధి హామీలో విధులు నిర్వహిస్తున్న అధికారుల తప్పిదాలపై తీవ్రంగా మండిపడ్డారు. ఉపాధిహామీ పనుల విషయంలో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహించటం సరికాదన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం తగదు

గత రెండు సంవత్సరాలుగా మామిడి మొక్కలు నాటేందుకు నాలుగైదు సార్లు దరఖాస్తు చేసుకున్న జేఈ, టెక్నికల్ అసిస్టెంట్లు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని మండలంలోని మాచ్నూర్ గ్రామానికి చెందిన రైతు ప్రశాంత్ అధికారుల ముందు వాపోయారు. ఈసీ అప్రూవల్ ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని చెప్పాడు. అధికారులు కలగజేసుకొని వారంలో సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీఓ బాల్‌రాజ్, జిల్లా ప్లాంటేషన్ అధికారి మణికుమార్, క్వాలిటీ కంట్రోల్ అధికారి సుభాష్, ఎంపీడీఓ సుధాకర్, ఏపీఓ రాజ్‌కుమార్, ఆయాగ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వారసత్వ నియామకాలు చేపట్టాలి



వినతిపత్రం అందిస్తున్న వీఆర్‌ఏలు, వారి వారసులు

ఝరాసంగం(జహీరాబాద్): గ్రామాల్లో విధులు నిర్వహించే వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగ నియామకాలు చేపట్టాలని వీఆర్‌ఏలు కోరారు. ఈ మేరకు బుధవారం ఝరాసంగం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ తిరుమలరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 61 సంవత్సరాలపైబడిన వారి వారసులకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. వీఆర్‌ఏల వారసుల ఉన్నత విద్యార్హతలు కలిగి ఉండి, ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. జీఓ వచ్చినప్పటి నుంచి 61 సంవత్సరాలుపై ఉన్న వారు ఎంతో మంది మృతి చెందారని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ వారసులకు ఉద్యోగాలు కల్పించి తమ బతుకుల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

ఘనంగా పండిట్ దీన్‌దయాళ్ జయంతి



సంగారెడ్డి ఎడ్యుకేషన్: దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: పండిట్ దీన్‌దయాళ్ జయంతి వేడుకలను బుధవారం కంది గ్రామ శివారులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి మాట్లాడుతూ.. పండిట్ దీనదయాళ్ సాధారణ జీవనం గడిపారని, ఉన్నత ఆలోచన, దృఢ సంకల్పం కలిగిన వ్యక్తి అని పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌లో సామాన్య కార్యకర్తగా పనిచేశారన్నారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దీన్‌దయాల్‌ను కుట్ర పూరితంగా హత్య చేసిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యాలయ కార్యదర్శి విజయకుమార్, ప్రధాన కార్యదర్శి మీనాగౌడ్, గోపాల్, లక్ష్మణ్ గౌడ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఖేడ్‌లో..

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అట్టడుగు వర్గాలకు ప్రభుత్వ పథకాల్లో తొలి ప్రయోజనం చేకూరాలని దిశానిర్దేశం చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రజనీకాంత్, బీజేపీ, అనుబంధ సంఘాల జిల్లా, స్థానిక బాధ్యులు సతీష్‌కుమార్, పట్నం మాణిక్, భూంరాజ్ పాల్గొన్నారు.

పుల్‌కల్‌లో..

పుల్‌కల్(అందోల్): పుల్‌కల్ మండలంలో పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పండిరి, దత్తు పాల్గొన్నారు.

ఆర్టీఐ పరిరక్షణ సంఘం అధ్యక్షుడిగా కృష్ణ

నారాయణఖేడ్: సమాచారహక్కు చట్టం పరిరక్షణ సంఘం ఖేడ్ మండల శాఖ అధ్యక్షుడిగా మండలంలోని పంచగామకు చెందిన కృష్ణను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. చట్టంపై చాలా మందికి అవగాహన లేకపోవడంతో అవినీతి, అక్రమాలు పెరిగాయన్నారు. చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించి, గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు.

రాజకీయాలకు అతీతంగా పథకాలు

● ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ర్యాకల్‌కు చెందిన కుమ్మరి తులసి, వెంకటాపూర్‌కు చెందిన గోస్కె నందినికి కల్యాణలక్ష్మి పథకం చెక్కులు రెండేళ్ల క్రితం మంజూరయ్యాయి. కాంగ్రెస్‌కు చెందినవారంటూ బీఆర్‌ఎస్ నాయకులు చెక్కులు చించేసి పథకం అందకుండా చేశారని మండిపడ్డారు. తాను తిరిగి సీఎం కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కు ల్యాప్స్ అయిన విషయాన్ని చెప్పి.. మళ్లీ మంజూరు చేయించినట్లు గుర్తు చేశారు. అలాగే, విద్యుదాఘాతంతో పశువులు మరణించగా విద్యుత్ శాఖ ద్వారా మంజూరు అయిన చెక్కులను పీర్ల తండాకు చెందిన హరిసింగ్, క్రిష్టాపూర్‌కు చెందిన నారాయణ, వంగ్దాళ్‌కు చెందిన సావినాయక్ ఒక్కొక్కరికి రూ.40లక్షల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

నిజాంపేట్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. మందుల విషయాలపై ఆరా తీశారు. వైద్య సేవలపై నిర్లక్ష్యం వహించొద్దని వైద్యాధికారులకు సూచించారు. అదే విధంగా, నిజాంపేట మండలం మునిగేపల్లిలో మహాలక్ష్మి పథకం లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేశ్‌బాబు, ఎంపీఓ శ్రీనివాస్, తహసీల్దార్ నాగజ్యోతి, నాయకులు రాములు, రఘుపతిరెడ్డి, రాధాకిషన్, వెంకటేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పటాన్‌చెరు ఎంఈఓగా నాగేశ్వరరావు నాయక్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఎంఈఓగా నాగేశ్వరరావు నాయక్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంతకుముందు పటాన్‌చెరు ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న పీపీ రాథోడ్ బదిలీపై రామచంద్రపురం ఎంఈఓగా వెళ్లడంతో ఆయన స్థానంలో మండలం ఘనపూర్ హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరరావు నాయక్ నేత బాధ్యతలు చేపట్టనున్నారు.

రాయికోడ్ ఎంఈఓగా అంజయ్య



అంజయ్యను సన్మానించిన ఉపాధ్యాయులు

రాయికోడ్(అందోల్): రాయికోడ్ మండల ఇన్‌చార్జి విద్యాధికారిగా వి.అంజయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాయికోడ్ జెడ్పీహెచ్‌ఎస్ ప్రధా నోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న అంజయ్యకు ఇన్‌చార్జి ఎంఈఓగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అంజయ్యను ఎంఆర్‌సీ కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది మోహన్, అనిల్, రాజు, దత్తు ఉన్నారు.

ఎంఈఓలుగా బాధ్యతల స్వీకరణ

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లో బుధవారం ఎంఈఓలు బాధ్యతలు చేపట్టారు. కల్హేర్‌లో జి.శ్రీనివాస్, సిర్గాపూర్‌లో నాగరం శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో టీచర్లు గోవర్ధన్, శ్రీనివాస్‌రెడ్డి, సంజయ్‌కుమార్, రహీం, శైలజకులకర్ణి పాల్గొన్నారు.



బాధ్యతలు చేపట్టిన ఎంఈఓ శ్రీనివాస్

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

● ఎంపీడీఓ శ్రీనివాస్



నారాయణఖేడ్: అవగాహన కల్పిస్తున్న కమిషనర్

సంగారెడ్డి: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని ఎద్దుమైలారంలో 'స్వచ్ఛ తా హీ సేవ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధులను శుభ్రం చేశారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీ వాహనంలో వేయాలన్నారు. ప్రస్తుతం వ్యాప్తి చెందుతున్న సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేందర్ రెడ్డి, ఓడీఎఫ్ అధికారులు విజయదత్, బాబ్జి, రాందాస్, అమిత్‌కుమార్ మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'స్వచ్ఛతా హీ సేవ' అవగాహన

నారాయణఖేడ్: 'స్వచ్ఛతా హీ సేవ' పై మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. పట్టణానికి చెందిన అంకూర్ పాఠశాల విద్యార్థులను డంప్‌యార్డు వద్దకు తీసుకెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరు చేసే విధానం, చెత్తతో ఎరువులను తయారు చేసే విధానంపై వారికి వివరించారు. ఇళ్ల వద్ద తల్లిదండ్రులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వివేకానంద్, మాజీద్, సద్దాం, హన్మండ్లు, శానిటేషన్ అధికారి శ్రీనివాస్ ఉన్నారు.

వేతన ఒప్పందాలు సీఐటీయూతోనే సాధ్యం

పటాన్‌చెరు టౌన్: పరిశ్రమల్లో కార్మికుల పక్షాన నిలుస్తూ వారికి మెరుగైన వేతన ఒప్పందాలు చేయడం సీఐటీయూకే సాధ్యమని వాగ్వాల్స్ యూనియన్ అధ్యక్షుడు, సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య అన్నారు. మండలంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో గల వాగ్వాల్స్ పరిశ్రమలో కార్మికుల వేతన ఒప్పందం బుధవారం డీసీఎల్ రవీందర్ రెడ్డి, పరిశ్రమ జీఎం సునీల్ అగర్వాల్ యూనియన్ అధ్యక్షుడు రాజయ్య, యూనియన్ నాయకుల సమక్షంలో వేతన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. మూడు సంవత్సరాలు పిరియడ్‌కు గాను కార్మికులకు రూ.7వేలు చారిత్రాత్మక వేతన ఒప్పందం జరిగినట్లు చెప్పారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటాం

● బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి



బస్సుపాస్‌లు అందజేస్తున్న గోదావరి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పేద విద్యార్థులకు ప్రతి ఒక్కరు అండగా ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అన్నారు. బుధవారం బెల్‌టౌన్ షిప్‌లోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా బస్సుపాస్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. గత కొన్నేళ్లుగా తమ ట్రస్టు ద్వారా విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేస్తున్నామన్నారు. అలాగే, రామచంద్రాపురం పట్టణంలో జరిగిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె పాల్గొని పలువురికి సభ్యత్వం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భూపాల్‌రెడ్డి, రాజు, రాంబాబు, పెంటారెడ్డి, జైపాల్ రెడ్డి, మురళీధర్‌రెడ్డి, దేవేందర్ రెడ్డిలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషితో ఎంవీఐ సేవలు

● కాంగ్రెస్ నాయకుడు తాహెర్ అలీ



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నారాయణఖేడ్: ఎమ్మెల్యే సంజీవరెడ్డి కృషితో త్వరలో రవాణాశాఖ సేవలు ప్రారంభం కానున్నాయని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఖేడ్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాహెర్‌అలీ, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, బంజారా సేవాలాల్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్ బుధవారం విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి ఖేడ్‌లో వారంలో రెండురోజుల పాటు రవాణాశాఖ సేవలు అందించాలని కోరగా అందుకు మంత్రి అంగీకరించారు. ఇందుకు నిరుపయోగంగా ఉన్న రైతుబజార్‌లో కార్యాలయం ఏర్పాటుకు పరిశీలించి వెళ్లగా పురపాలిక ఆధ్వర్యంలో అవసరమైన పనులు చేస్తున్నారన్నారు. సీపీఐ నాయకులు తమ పబ్బం గడుపుకొనేందుకు రవాణాశాఖ సేవలు ఖేడ్‌లో అందించాలంటూ సంతకాల సేకరణ, అధికారులకు వినతి పత్రాలు పేరుతో ప్రజలను మభ్యపెట్టడానికి యత్నిస్తున్నారని విమర్శించారు. మాజీ ఎంపీటీసీ రాంసింగ్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **సీసీరోడ్డు నిర్మాణం పూర్తి**

నారాయణఖేడ్: మున్సిపాలిటీ 3వ వార్డులోని చాకలిగల్లీలో సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేశారు. బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ రోడ్డును పరిశీలించారు. నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు.

◆ **ప్రభుత్వ పాఠశాల సందర్శన**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నందికంది ప్రభుత్వ పాఠశాలను బుధవారం రూమ్ టూ రీడ్, ఐఎంసీ విదేశీ ప్రతినిధులు సందర్శించారు. ఐఎంసీ ఇండియా ఆర్ట్ కాంటెస్ట్‌లో భాగంగా వేసవి సెలవుల్లో నిర్వహించిన పోటీల్లో నందికంది ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. వారికి ఐఎంసీ ఇండియా విదేశీ ప్రతినిధి యెట్, రూమ్ టూ రీడ్ ఇండియా ప్రతినిధి శుభాంగి బహుమతులు అందజేశారు. అలాగే, పాఠశాలకు రూ.20వేల విలువ చేసే ప్రొజెక్టర్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంఎంఓ అనురాధ, ఎంఈఓ శంకర్, కాంప్లెక్స్ హెచ్‌ఎం వినయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు బసవయ్య పాల్గొన్నారు.

◆ **క్రీడాసామగ్రి అందజేత**

నారాయణఖేడ్: జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులకు పూర్వవిద్యార్థుల సహకారంతో బుధవారం క్రీడాసామగ్రిని ఉపాధ్యాయులు డా.రాజయ్య, చంద్రశేఖర్ అందజేశారు. ప్రశాంత్ నాలుగు వాలీబాల్స్, క్యారంబోర్డు, చెస్‌బోర్డులు, స్కిప్పింగ్ తాళ్లు, 12 టెన్నిస్ కాయిన్లు వితరణ చేయగా, సంతోష్ మరో వాలీబాల్‌ను వితరణ చేశారు. తమ పాఠశాలకు దాతలు సహాయం చేయడం హర్షనీయమని ప్రధానోపాధ్యాయులు అన్నారు.

◆ **నూతన కమిటీ ఎన్నిక**

జహీరాబాద్: జహీరాబాద్ శాఖ ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం (ఐసీఈయూ)నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఐసీఈయూ అధ్యక్షుడిగా టి.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా మాణయ్య, ప్రధాన కార్యదర్శిగా బి.అశోక్, సహాయ కార్యదర్శులుగా చంటి, సాయిహరి, కోశాధికారిగా అశోక్‌కుమార్, కన్వీనర్‌గా జమున, సభ్యులుగా మధుసూదన్, నర్సింహులు, రాజశేఖర్ ఎన్నికయ్యారు.

◆ **సాంస్కృతిక సంపద ప్రపంచానికే ఆదర్శం**

సంగారెడ్డి, ఎడ్యుకేషన్: భారతదేశ సాంస్కృతిక సంపద ప్రపంచానికే ఆదర్శమని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జగదీశ్వర్ తెలిపారు. బుధవారం కళాశాలలో యువ టూరిజం క్లబ్, చరిత్ర విభాగాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ పర్యాటక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చారిత్రాక ప్రదేశాలు, సాంస్కృతిక సంపదలపై అవగాహన కల్పించారు. పర్యాటక రంగం అభివృద్ధిలో యువత పాత్ర' అనే అంశంపై వక్తృత్వ, 'పర్యావరణహిత, సుస్థిర పర్యాటక రంగం 'అనే అంశంపై పోస్టర్ పెయింటింగ్ కాంపిటీషన్ పోటీలు నిర్వహించారు.

◆ **ఘనంగా పోషణమాసం**

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని హద్నూర్ రైతు వేదికలో బుధవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసం, అన్నప్రాసన, గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తలు, పరిశుభ్రత తదితర అంశాలపై సీడీపీఓ అంజమ్మ, సూపర్‌వైజర్ అనిత అవగాహన కల్పించారు.

◆ **ఉపాధ్యాయుల నిరసన**



రాయికోడ్(అందోల్): బదిలీ చేసి, రిలీవ్ చేయకుండా ఇంకా పాత పాఠశాలల్లోనే తమను కొనసాగించడాన్ని తప్పుపడుతూ మండల ఎస్‌జీటీ ఉపాధ్యాయులు బుధవారం పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జీఓ 25ను సవరించి, తమను రిలీవ్ చేయాలని ప్లకార్డులు ప్రదర్శించి ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల సంఘం అధ్యక్షుడు యాదవులు, ఉపాధ్యాయులు అబ్దుల్ కలాం, ప్రశాంత్, నాగభూషణం, రాహుఫ్, అరుణజ్యోతి, అనిత తదితరులున్నారు.

◆ **విద్యుత్ షాక్‌తో ఆవు మృతి**

జహీరాబాద్ టౌన్: పట్టణ శివారులోని ఓ వెంచర్‌లో విద్యుత్ షాక్ తగిలి ఆవు మృతి చెందింది. పట్టణం నుంచి అల్గోల్ వెళ్లే దారిలో శ్రీసిద్ధేశ్వర ఆలయ సమీపంలో కొత్తగా వెంచర్ ఏర్పాటు చేశారు. వెంచర్‌లో కరెంట్ లైన్ అండర్ గ్రౌండ్‌లో ఉంది. పట్టణానికి చెందిన రైతు నాగేంద్రప్పకు చెందిన ఆవు బుధవారం మేత కోసం వెంచర్ గుండా వెళ్తున్న క్రమంలో ఎర్తింగ్ తీగకు తాకింది. దీంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది.

◆ **పరిశుభ్రత అందరి బాధ్యత**

నారాయణఖేడ్: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం మున్సిపాలిటీ సమావేశ మందిరంలో అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు, స్వయం సహాయక బృందాల మహిళలు, ఆర్పీలు, పలు వార్డులు మహిళలతో సమావేశం నిర్వహించారు.

◆ **ఘనంగా ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవం**

పటాన్‌చెరు: గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ, రుద్రారంలో బుధవారం 'ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవం-2024ను ఘనంగా నిర్వహించారు. 'ప్రపంచ అవసరాలను తీరుస్తున్న ఫార్మసిస్టులు' అనే ఇతివృత్తంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు నిపుణులు పాల్గొని ఫార్మారంగ అభివృద్ధి, విస్తరణ, ఉపాధి అవకాశాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

◆ **ఎస్‌ఐకి సన్మానం**

రాయికోడ్(అందోల్): నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ నారాయణను మండల ముదిరాజ్ సంఘం నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి మిఠా యి తినిపించారు. శాంతిభద్రతల పరిరక్షణలో తమ సంఘం తరపున పూర్తిస్థాయి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మండల సంఘం అధ్యక్షుడు తమ్మలి రాజు, కార్యదర్శి గోపాల్, నాయకులు బక్కప్ప, నవీన్, రమేశ్, అనిల్ తదితరులు ఉన్నారు.

కంటి వైద్య శిబిరంతో లబ్ధి

ట్రైనీ కలెక్టర్ మనోజ్



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్, తదితరులు

కొండాపైర్(సంగారెడ్డి): గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రైనీ కలెక్టర్ మనోజ్ అన్నారు. బుధవారం మండలంలోని తొగర్‌పల్లిలో శంకర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ.. మానవ శరీరంలో కన్ను చాలా ప్రధానమైందన్నారు. మనం తీసుకుంటున్న ఆహారం వల్ల చిన్నారులకు సైతం కంటి సమస్యలు రావడం బాధాకరమన్నారు. పేదలకు ఉచిత కంటి పరీక్షలు చేసి, అవసరమైన శస్త్రచికిత్సలు చేసి మందులను అందించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ మనోజ్‌ను కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్ గౌడ్ సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, మండల వైద్యాధికారి రమామణి, పంచాయతీ కార్యదర్శి నర్సమ్మ, వైద్యులు, ప్రజలు పాల్గొన్నారు.